RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 240

శుక్రవారం
ఆగస్టు 22, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



**రెవెన్యూ అధికారుల మాయాజాలం..?**

2లో..



# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి:**

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రూ.5 కోట్ల 87 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అందులో జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘ, జనరల్ ఫండ్ నిధులు, ఎస్ఎఫ్ సి పథకాల క్రింద రూ. 4 కోట్ల 87 లక్షల వ్యయంతో బల్దియా పరిధి 32 వ డివిజన్ బిఆర్ నగర్ లో బస్తి దవాఖాన, ఎన్ ఎన్ నగర్ లో సిసి రోడ్లు, జ్యోతినగర్ లో సిసి రోడ్లు, అంబెడ్కర్ భవన్ కమ్యూనిటీ హాల్, బీరన్నకుంట కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు, 28వ డివిజన్ బట్టలబజార్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కిచెన్ షెడ్, 42 డివిజన్ రంగశాయిపేట లో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులకు, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో మాషుఖ్ రబ్బానీ దర్గాలో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం బిరన్నకుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంత్రి, మేయర్, కలెక్టర్, కమిషనర్ మధ్యాహ్నం భోజనం వడ్డించారు. కరిమాబాద్ పరపతి సంఘ భవనంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను మంత్రి కొండా సురేఖ,మేయర్, కలెక్టర్, కమిషనర్ లతో కలసి అందచేశారు.అనంతరం కరీమాబాద్ లోని ఫంక్షన్ హాల్ లో, రంగషాయిపేట కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని అన్నారు.



కొత్త రేషన్ కార్డుల కోసం తెలంగాణ ప్రజలు గత పది సంవత్సరాల నుండి ఎదురు చూశారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల సమస్యల మీద దృష్టి సారిస్తున్నారని, అందుకే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రేషన్ ద్వారా దొడ్డు బియ్యం ఇచ్చిందని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చాక పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. నూతన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని రేషన్ కార్డు మంజూరైన వారికి వెంట వెంటనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి వివరించారు. సంక్షేమ వసతి గృహాల్లో 40శాతం మిస్ చార్జీలతోపాటు 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచామని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తూ పౌష్టికాహారం అందించే దిశగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. పూర్తి నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలనే

మిగతా 3వ పేజీలో..



# కూలిన ఇల్లు..!

**- పేద కుటుంబానికి సిపిఎం పక్షాన ఆర్థిక సహాయం**

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో ఇటీవల వర్షాల కారణంగా దళిత సామాజిక వర్గానికి చెందిన ఎదురుగట్ల మల్లయ్య,నివసిస్తున్న పాత పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. వర్షాల వల్ల ఇల్లు కూలిపోయి దెబ్బతిని రోడ్డుమీదకు వచ్చిన మల్లయ్య కుటుంబం దుర్భర పరిస్థితిలో ఉండడంతో,వాళ్ళ ఇల్లును మరమ్మత్తులు చేసుకొలేకుండా చేసింది.విషయం తెలుసుకొని మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రామాంచ అశోక్, గ్రామస్తులు గాజుల పార్టీ రాంబాబు, అత్తెన నరసయ్య, కళ్ళపల్లి కృష్ణమూర్తి, రామంచ ప్రభాకర్, పర్లపెల్లి అంజయ్య, రామంచ దుర్గయ్య సహా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంబంధిత జిల్లా అధికార యంత్రాంగం ఈ బాధిత కుటుంబానికి నూతన ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, మానవతవాదులు కూడా ముందుకు వచ్చి తమవంతుగా సాయం చేయాలని పిలుపునిచ్చారు.

# కమిషన్ కోసం డీలర్ల ఎదురుచూపులు..!



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండగ రోజు అట్టహాసంగా హుజూర్నగర్ నియోజకవర్గంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించి ప్రజల అభిమానాన్ని చూరగొట్టుకుంది. జిల్లాలోని రేషన్ డీలర్లు ఐదు నెలలుగా పంపిణీ చేసిన కమిషన్ కోసం ఎదురుచూస్తున్నారు. కుటుంబ జీవనం ఎలా కొనసాగించాలని ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకుంటున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఒక్కొక్క డీలర్ కి 90 వేల రూపాయలు చొప్పున కమిషన్ బకాయి పేరుకుపోయి ఉన్నది. వారం లోపు విడుదల చేయకపోతే నిరసన వ్యక్తం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తుంది. డీలర్ల కమిషన్ వారం లోపు విడుదల చేయకపోతే సెప్టెంబర్ మాసం పంపిణీకి వెనకడుగు వేస్తున్నట్లు పలువురు డీలర్లు పేర్కొంటున్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో మొదటి స్థానంలో నిలిచింది. డీలర్లు పారదర్శకంగా పంపిణీ చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిన డీలర్లకు తెలంగాణ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతుంది. తెలంగాణ ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో గౌరవ వేతనం 5000, కమిషన్ క్వింటాల్ కు 300 రూపాయలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఉసేత్తడం లేదు. దీంతో రేషన్ డీలర్ల రాష్ట్ర నాయకత్వం నిరసన వ్యక్తం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో....జిల్లాలో ఇప్పటికే రేషన్ కార్డులు భారీగా పెరిగాయి. దీంతో జిల్లాలోని డీలర్లు ఎంతో సంబురా పడుతున్నారు. కమిషన్ కూడా పెరుగుతుందని డీలర్లు ఆనందంలో మునిగిపోతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం డీలర్లకు ఐదు నెలలుగా కమిషన్ విడుదల చేయకపోవడంతో కొంచెం నిరాశగా ఉన్నారు. ఇప్పటికైనా ఐదు నెలల కమిషన్ వెంటనే విడుదల చేయాలని, నెల నెల కమిషన్ విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు పరచాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

# వృధాగా పోతున్న మంచినీరు

వేద న్యూస్, మడికొండ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 64 వ డివిజన్ మడికొండ మెట్టుగుట్ట ఆర్చ్ ఎదురుగా ఉన్న నెహ్రూ నగర్ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద మున్సిపాలిటీ నీరు వృధాగా పోయి మురుగు కాలువలో కలుస్తుంది. గత కొన్ని రోజులుగా మంచినీటి పైపులు పగిలి నీరు వృధాగా పోతున్నా కనీసం పట్టించుకున్న నాధుడే లేడని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నిసార్లు మున్సిపాలిటీ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు చెప్పిన కూడా పట్టించుకోవట్లేదు అని అంటున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నీరు వృధాగా పోకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# స్పందించారు..కానీ పరిష్కారం మరిచారు

- కమలాపూర్ లో తీరని నీటి కష్టాలు
- అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన లభించని పరిష్కారం
- సంబంధిత అధికారుల పనితనానికి ఈ ఘటనే నిదర్శనం
- నెలలు గడిచినా దొరకని పరిష్కారం
- అధికారులు నిర్లక్ష్యం వీడాలని పలువురి విమర్శలు



## కాసింపల్లిలో నీటి కష్టాలు..!

- మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు
- సుమారుగా 10 కుటుంబాలకు నీళ్ల కరువు
- మంచినీళ్లు సరఫరా చేయాలని వేడుకోలు

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కాసింపల్లిలో సుమారుగా 10 కుటుంబాలకు మిషన్ భగీరథ నీళ్ళు రాక ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుగు పొరుగు వారి ఇంటి నల్లా వద్దకు వెళ్లి నీళ్లు మోసుకుంటూ వచ్చి వారి అవసరాలు తీర్చుకుంటున్నారు. స్థానిక మాజీ ప్రజాప్రతి నిధులకు, సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించిన అధికారులతో మాట్లాడి అప్పుడు చేపిస్తాం ఇప్పుడు చేపిస్తాం అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. సమస్య గురించి చెప్పినపుదల్లా దాటవేసే ధోరణితో వ్యవహరించారని, కానీ సమస్యను మాత్రం పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ కూలి పని చేసుకుని జీవనం కొనసాగించే ఓ మహిళ అయితే మాత్రం మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రతిరోజూ ఇరుగుపొరుగు వారి నల్లా వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లు మోసుకుంటూ తమ గోళాన్ని నింపుకొని అవసరాలను తీర్చుకుంటున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మిషన్ భగీరథ పథకం ప్రతి ఇంటికి మంచినీళ్లు సరఫరా చేయాలనే సదుద్దేశంతో చేపట్టిన కొన్ని కుటుంబాలకు మాత్రం మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. అధికారులు స్పందించి తమ నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే గ్రామపంచాయతీ సిబ్బంది ఇలాంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజల కష్టాలను తీర్చాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఇలాంటి సమస్యలను పై అధికారులకు చేరవేస్తున్నారా? లేక చేరవేసిన కూడా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారా? అనేది అర్థం కాని పరిస్థితి. ఏది ఏమైనా ప్రజల నీటి కష్టాలను తీర్చాల్సిన అవసరం ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఎంతైనా ఉంది.

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కాసింపల్లిలో నీటి సమస్య ఉందని గత నెలలో వేద న్యూస్ తెలుగు దినపత్రిక కాసింపల్లిలో నీటి కష్టాలు..! అనే శీర్షికన కథనం ప్రచురించడంతో ఆనాడు స్పందించిన అధికారులు వెంటనే సంబంధిత ప్రదేశానికి వెళ్లి నీటి సమస్య గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల తీరు పట్ల బాధిత కుటుంబాలు తమ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. ఆనాడు రేపు వచ్చి అధికారులు సమస్యను పరిష్కరిస్తారని ఆశించిన బాధిత కుటుంబాలు ఇవాల్టి వరకు కూడా ఆ రేపు కోసం ఎదురుచూస్తున్నారు. ఆ రేపు వచ్చేలా లేదు వీళ్ల నీటి సమస్య తీరేలా లేదు.

అధికారులు బాధిత కుటుంబాల నీటి సమస్యను తీర్చడంలో ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారో ఎవరికి అర్థం కాని పరిస్థితి. ఒక కాసింపల్లిలోనే నీటి సమస్య తీర్చలేని అధికారులు కమలాపూర్ మండల కేంద్రంలో చాలా ఏరియాల్లో నీటి సమస్యతో బాధపడే కుటుంబాలు చాలా వరకు ఉన్నాయి. అవన్నీ ఎప్పుడు తీరుస్తారు అనే సందేహం నెలకొంది. మండల కేంద్రంలో ఉన్న అన్ని ఏరియాల్లోని నీటి సమస్యలు తీర్చాలంటే అధికారులకు ఎన్ని సంవత్సరాలు పడుతుందో తెలియకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాసింపల్లిలో నీటి సమస్యను తీర్చడమే కాకుండా మండల కేంద్రంలో ఏయే ఏరియాల్లో నీటి సమస్య ఉందని క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సమస్య ఉన్న బాధిత కుటుంబాలకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేద న్యూస్

శుక్రవారం ఆగస్టు 22, 2025

# అంగన్వాడీ సెంటర్ ఆకస్మిక తనిఖీ



**వేద న్యూస్,బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ 1,4 సెంటర్లను డిడబ్ల్యూఓ లక్ష్మీరాం, గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో ఆక్టివిటి చేయించారు. అలాగే పిల్లలను గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అడిగి తెలుసుకున్నారు.

# నేడు ఎన్ సీసీ సీనియర్ డివిజన్లో ఎంపిక

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ లాల్ బహదూర్ కళాశాలలో ఎన్సిసి ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో 2025- 26 సంవత్సరానికి మొదటి సంవత్సరం ప్రవేశాల పొందిన విద్యార్థిని, విద్యార్థులకు ఎన్సిసి సీనియర్ డివిజన్లో ఎంపిక కార్యక్రమం 22 గురువారం (నేడు) కళాశాల మైదానం ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ప్రారంభం జరుగుతుందని ఈ ఎంపిక కార్యక్రమానికి పదవ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్ఎస్ రామదురై మరియు ఆర్మీ సిబ్బంది హాజరవుతారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. భవిష్యత్తులో భారత ఆర్మీ, కేంద్ర రిజర్వ్ ,రిజర్వ్ పోలీస్ ,రాష్ట్ర పోలీస్, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ, ప్రవేట్ రంగాల్లో మంచి ఉద్యోగ అవకాశాల్లో ఎన్సిసికి ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని కళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్. డాక్టర్ ఎం సదానందం క్యాడేట్స్ పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ గా విధులు నిర్వహిస్తున్న రమేష్ కు ఉత్తమ అవార్డు ను ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్,మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. కాగా ఇబ్రహీంపట్నం తాహసిల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్,ఆర్ ఐ రమేష్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు తహసిల్దార్ వరప్రసాద్, మాజీ జెడ్పిటిసి కొక్కు పురుషోత్తం, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పదోన్నతులకు లైన్ క్లియర్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతులపై ఉన్న స్టే ను హైకోర్టు కొట్టివేయడంతో మార్గం సుగమమైంది. తీర్పు కాపీ రాగానే పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమవుతుందని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. తద్వారా వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మంది ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించనుందని హర్షం వ్యక్తం చేశారు.



# రెవెన్యూ అధికారుల మాయాజాలం..?

- లేని దారి ఉన్నట్లు కలెక్టర్‌కు సమాచారం..?
- దారి లేదని రాసి పంపుతాం..లక్ష రూపాయలు ఇస్తారా..?
- రెవెన్యూ అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి
- బాధిత రైతు వెంకట్ రెడ్డి ఆరోపణ





**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామ పంచాయతీ ఆమ్లెట్ విలేజ్ నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆళ్ల వెంకటరెడ్డి తండ్రి మల్లారెడ్డి యొక్క భూమి సర్వే నంబర్ 517 లో అక్రమంగా దారి కావాలని ఆళ్ళ మల్లారెడ్డి తండ్రి బాపురెడ్డి చాలా సంవత్సరాలగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంకట్ రెడ్డి ఆరోపణ చేశారు. అదే విదంగా తన పైన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి కేసులు కూడా పెట్టిరాని వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. నిజానికి ఆ సర్వే సంబర్ లో ఎటువంటి దారి లేదు కానీ, ఫేక్ ఫోటోలు పెట్టి ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసినారన్నారు. సమస్యపై విచారణ చేసి పరిష్కారించాలి అని కలెక్టర్ ఎమ్మార్వోకు ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మార్వో ఆదేశానుసారం గిర్ధవార్ ఎంక్వయిరీ చేసి చుట్టుపక్కల వాళ్ళని అడిగారు.అందరూ కూడ దారి లేదని చెప్పారు. గత 60 సంవత్సరాల నుండి దారి లేదు అని చుట్టూ పక్కల రైతులు చెప్పారన్నారు. దీనిపై ఎమ్మార్వో కలెక్టర్ కు తప్పుడు నివేదిక ఇచ్చారని విమర్శించారు. ఇదేంటని అడిగితే దారి లేదు అని రాసి రిపోర్ట్ కలెక్టర్ కి ఇవ్వాలంటే డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. కావున దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి తప్పుడు నివేదిక ఇచ్చిన మండల రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కారించి తమకు న్యాయం చేయాలని బాధితుడు వెంకట్ రెడ్డి కోరుతున్నారు.

# దేహదానం చేయడం పవిత్రమైన కార్యం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనక శ్రీ విజయ రఘునందన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అధ్యాపకులు వారి మరణానంతరం దేహదానం (బాడీ డొనేషన్) చేస్తామనీ అంగీకార పత్రాలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి జాటోత్ కి అందించారు. అనంతరం రాజేశ్వరిదేహదానం దాతలకు సర్టిఫికెట్లు అందించారు. ఈసందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి మాట్లాడుతూ దేహదానం (బాడీ డొనేషన్) చేయడం అనేది ఒక పవిత్రమైన కార్యమన్నారు. చనిపోయిన తర్వాత కాల్చడమో,పూడ్చడమో చేస్తారనీ అయితే మెడికల్ కళాశాలకు దేహదానం చేయడం ద్వారా వైద్య విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడానికి, పరిశోధనకు, జ్ఞానాభివృద్ధికి, ఉపయోగపడుతుందనీ అంగీకార పత్రాలు అందించిన దాతలను అభినందించారు. కనకశ్రీ విజయరఘునందన్ కుటుంబం స్ఫూర్తితో వీరందరూ దేహదాన పత్రాలు అందించడం అభినందనీయం అన్నారు. అంగీకార పత్రాలు అందించిన వారిలో ప్రిన్సిపాల్ కనుక శ్రీ విజయ రఘునందన్, వాసరవేణి పర్శరాములు, చెన్నోజ్వల శశిధర్, గుమ్మడి మురళి, గుమ్మడి స్వప్న, సామాజిక కార్యకర్త దుంపెన రమేష్ లు ఉన్నారు. మెడికల్ కళాశాలకు బాడి డొనేషన్ చేసిన మొదటి ఆరుగురు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు కావడం విశేషం.ఇందులో ప్రిన్సిపాల్ జాటోతు రాజేశ్వరి ,అనాటమీ డిపార్ట్మెంట్ హెడ్ అన్వరున్నీస, డాక్టర్ అర్పిత, డాక్టర్ దివ్య, తదితరులున్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

**వేద న్యూస్, పెద్దపల్లి :**



పెద్దపల్లి జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పలు గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. శ్రీరాంపూర్ మండలంలోని కూనారం, ఇదులాపూర్ గ్రామంలో మిస్సింగ్ సర్వే నెంబర్ పట్టా కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అనంతరం జాఫర్ ఖాన్ పేట, ఇదులాపూర్ గ్రామం లోని అప్పర్ ప్రైమరీ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా చూడాలని, పిల్లలకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకునేలా స్కిల్స్ పెంపోందించాలని అన్నారు.అంగన్వాడీ సెంటర్ లను పరిశీలించి ఎంత మంది పిల్లలు వస్తున్నారు. ఎలాంటి ఆహారం ఇస్తున్నారు, హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డి.టి. శంకర్, సర్వేయర్ రాజు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ పై చర్యలు తీసుకోవాలి

## - తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

**వేద న్యూస్, కొత్తపల్లి:**




కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని దేవదాయ శాఖ భూమి విషయంలో ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తు పై ఏం చర్యలు తీసుకున్నారని తెలుసుకో వడానికి తాసిల్దార్ కార్యాలయానికి వెల్లి న తమకు సమాధానం చెప్పకుండా నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించి తాగుబోతులంటూ పరుష పదజాలంతో మాట్లాడిన కొత్తపల్లి తాసిల్దార్ పై శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ జిల్లా ఆర్డీవో ను కోరారు. భూమి విషయంలో సరైన సమాధానం చెప్పాల్సిన బాధ్యతగల హోదాలో ఉన్న తాసిల్దార్ ప్రజాసంఘాల పట్ల ఇలా ప్రవర్తించడం ఆ పదవికి అవమానకరం అన్నారు. జిల్లా ఆర్డీవో తక్షణమే జోక్యం తీసుకొని ఓ ప్రత్యేక అధికారితో భూమి విషయంలో అగ్రిమెంట్లు విషయంలో జరుగుతున్న అవకతవకలపై తగు విచారణ జరిపించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి అజయ్ ,రాయి కంటి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు తదితరులున్నారు.

# సిసి రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్




**వేద న్యూస్, కాజీపేట :**

హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, 63 డివిజన్లోని జూబ్లీ మార్కెట్ , జామా మస్జిద్ వీధుల్లో సిసి రోడ్ పనులను గురువారం 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ సయ్యద్ రజాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు జామ మస్జిద్, జూబ్లీ మార్కెట్ వీదులు చిన్న వర్షం పడితే చాలు ఇండ్లలో నీరు ప్రవహించేటివి అని, ఎన్నిసార్లు టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని వేడుకున్న పట్టించుకోలేదు కానీ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఈ సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చాడని, అందుకు నాయిని రాజేందర్ రెడ్డి కి కార్పొరేటర్ విజయ శ్రీ సయ్యద్ రజాలి, జామా మస్జిద్ కమిటీ జూబ్లీ మార్కెట్ ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రాంతి, భరత్ రాజ్, మహమ్మద్ షబ్బీర్ అలీ, మమ్మద్ బిలాల్, బిలాల్ ఖురేషి సయ్యద్, ఆసిఫ్, మొహమ్మద్, ముస్తాక్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉద్దేశంతో రామకృష్ణ మిషన్ అక్షయపాత్ర వారి ద్వారా జిల్లాలోని 123 ప్రభుత్వ పాఠశాలలో మొదటి విడతలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నట్లు, అందులో భాగంగా ఈరోజు కరీమాబాద్ లోని బీరన్నకుంటతో పాటు 55 ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం జరిగిందన్నారు. దశలవారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తామన్నారు. వరంగల్ మహా నగరాన్ని హైదరాబాద్ మాదిరిగా సమగ్ర అభివృద్ధి చేయుటకు గాను మామునూరు విమానాశ్రయం, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, ఏర్పాటుకు ముందుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. వరంగల్ నగరాన్ని ముంపు నుండి నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు, ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించాలని మంత్రి కోరారు.గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించారని నేడు, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో పేదవారి ఇంటి కలలు సహకారం అవుతున్నాయని మంత్రి కొండా సురేఖ తెలిపారు.నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు కేటాయించగా అర్హులైన అత్యంత పేదవారికి మంజూరు చేయగల వారు ఇల్లు నిర్మించుకుంటున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా 3500 ఇందిరమ్మ ఇల్లను నిరుపేదవారికి మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న తాను ప్రణాళిక బద్ధంగా జిల్లాలోని అన్ని దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు అర్హత కల లబ్ధిదారులకు 6815 నూతన రేషన్ కార్డులు, మంజూరు చేసి, 26766 కుటుంబ సభ్యుల పేర్లను రేషన్ కార్డులు నమోదు చేయడం జరిగిందన్నారు. తూర్పు నియోజకవర్గంలో 2690 కొత్త రేషన్ కార్డులను, రేషన్ కార్డులలో 7592 కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయడం జరిగిందని, మీసేవ, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న పరిశీలన పూర్తయిందని అర్హత గల వారికి అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు,కి బోయినిపల్లి మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగినది. బి అర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 10 సంవత్సరాల పాలనలో మండలంలో ఉన్న సమస్యలను పట్టించుకోలేదు. తెలంగాణలో ఆరు గ్యారెంటీ ల పేరిట అధికరంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం బోయినిపల్లి మండలంలో ఉన్న లో లెవెల్ వంతెనలను ఇప్పటివరకు కూడా నిర్మించలేకపోయింది, బోయినిపల్లి నుండి వేములవాడ పోయే రహదారిలో ఉన్న గంజి వాగు వద్ద పిల్లర్లు వేసి ఇడిచి పెట్టినారు కానీ బ్రిడ్జి నిర్మాణం కాకపోవడం వలన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లాలంటే బోయినిపల్లి మండల ప్రజలకు అదే విధంగా వివిధ జిల్లాల నుండి మండలాల నుండి గ్రామాల నుండి వస్తే భక్తులకు ఇబ్బంది కలుగుతున్న పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్, అదేవిధంగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం, తొందరగానే పూర్తి చేస్తామని చెప్పడం జరిగింది, కానీ ఇంతవరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు, గంజి వాగు వద్ద బ్రిడ్జి తో పాట మండలంలో ఉన్న లో లెవెల్ వంతలను హై లెవెల్ వంతెనలు గా ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులకు ఏలాంటి మట్టి కొరత లేకుండా ఇసుక కొరత లేకుండా చూడాలని బిజెపి మండల శాఖ అధ్యక్షుడు ఎడపల్లి పరుశరాములు,ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, బిజెపి మండల నాయకులు, బొంగాని అశోక్ గౌడ్, జువ్వెత్తుల శ్రీనివాస్ రెడ్డి, సారం పెల్లి రాజు తుమ్మనపల్లి కిరణ్, అమిరి శెట్టి గంగయ్య, బోగోజి గంగాధర్ చారి, మెరుపుల గంగాధర్ గౌడ్, అమిరిశెట్టి అంజయ్య, రమేష్, సావనపల్లి అనిల్, ఆంజనేయులు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# 317 బాధితులకు న్యాయం చేయాలి

## – పిఆర్ సిని వెంటనే ప్రకటించాలి




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, ప్రతినెల 700 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు నెలలైనా కూడా కనీసం 300 కోట్లు కూడా కేటాయించకపోవడం శోచనీయమని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమానాద్ రెడ్డి అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 700 కోట్లు మంజూరు చేస్తే పెండింగ్ బిల్లులు చెల్లించే అవకాశం కలుగుతుందని లేనియెడల వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు మరియు వివిధ అవసరాలకు ఉపాధ్యాయ ఉద్యోగులు జిపిఎఫ్ ఖాతా నుండి కొంత మొత్తాన్ని తీసుకుంటారు. ఇలాంటివి వారి అవసరాలకు అందకుండా పోతున్నాయి అన్నారు. అంతే కాకుండా 317 జీవో వల్ల వారి యొక్క సొంత ప్రదేశాలు వదిలేసి దూర ప్రాంతాల్లోని జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారిని వారి సొంత జిల్లాలకు వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఏర్పడగానే సిపిఎస్ ను రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు ఆ అంశాన్ని పట్టించుకో వడం లేదని వెంటనే సిపిఎస్ ని రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అద్భుతమైన పిఆర్సిని ప్రభుత్వం ఏర్పడగానే ప్రకటిస్తామని చెప్పి ఇన్ని రోజులైనా కూడా పిఆర్సిని ప్రకటించకపోవడం వల్ల చాలామంది ఉద్యోగులు నష్టపోతున్నారని కావున వెంటనే పిఆర్సి ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల కృష్ణ చైతన్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు రామ లింగారెడ్డి, లౌడ్య శ్రీనివాస్, జిల్లా బాధ్యులు బాలగౌడ్ వెంకట హనుమాన్ గుంటి రవీందర్ కుమారస్వామి రాజశేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు.

# గర్ల్ బాస్ ఫ్యూచర్ రెడీ శిక్షణా కార్యక్రమం




**వేద న్యూస్, హైదరాబాద్ :**

ప్రభుత్వ సిటీ కాలేజీ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో గర్ల్ బాస్ ఫ్యూచర్ రెడీ శిక్షణా కార్యక్రమం ఆగస్టు 19 నుండి 21 వరకు మూడు రోజులపాటు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ ఎన్‌జిఓ లాంచ్ గర్ల్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవ్ దత్ శుక్లా మాట్లాడుతూ, "భవిష్యత్ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకం. గర్ల్ బాస్ ఫ్యూచర్ రెడీ వంటి కార్యక్రమాలు విద్యార్థినులను ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తాయి. ఉపాధి, వ్యాపారారంభం, ఉన్నత విద్య ౦ ఏ మార్గాన్ని ఎంచుకున్నా వారు సమాజానికి ఆదర్శం కావాలి. అందుకు మహిళా అధ్యాపకులకు ఈ శిక్షణ నిర్వహించామ'ని పేర్కొన్నారు. "ఈ అధ్యాపకులు మొదటి సంవత్సరం విద్యార్థినులకు మూడు సంవత్సరాలలో 75 గంటలపాటు నిర్వహించే శిక్షణలో వివిధ నైపుణ్యాలు, స్వయంనిర్ణయాధికారం, భవిష్యత్తు అవకాశాలపట్ల అవగాహన కలిగిస్తారని తెలిపారు. లాంచ్ గర్ల్స్ సంస్థతో కళాశాల విద్యాశాఖకి ఉన్న ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింద"ని అన్నారు.

లాంచ్ గర్ల్స్ సీఈఓ అగటా రుట్కోవిస్కీ, అనుశీలా చట్టర్జీ, జయ వర్ధన్ శిక్షణ అందించగా, శిక్షణా కార్యక్రమానికి శ్రీమతి సునీత సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రొ. శిరీష, డా.సుధారాణి, లలిత చైతన్య, సంతోష్, సిటీ కాలేజీ మహిళాఅధ్యాపకులతో పాటు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఖైరతాబాద్, మహిళా డిగ్రీ కాలేజీ గోల్కొండకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నా అధ్యాపకులకు ముఖ్య అతిథి సర్టిఫికెట్లు అందజేశారు.

# మియాపూర్ లో దారుణం



## –ఒకే కుటుంబంలో 5 గురు మృతి

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**

ఒకే కుటుంబానికి చెందిన 5 మంది అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మక్త మహబూబ్ పేట్ కాలనిలో నివాసం ఉంటున్న ఉప్పరి లక్ష్మయ్య (60), ఉప్పరి వెంకటమ్మ (55),కూతురు కవిత (24) అల్లుడు అనిల్ (32 ) మనుమడు అప్పు (2) మృత్యువాత పడ్డారు.మియాపూర్ పోలీసులు క్లూస్ టీమ్ తో సంఘటన స్థలానికి చేరుకొని ధర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య లేదా ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో మియాపూర్ పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి



## – ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేద న్యూస్, వేములవాడ:**

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల ను నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ టెంపుల్ గెస్ట్ హౌస్ సమావేశం మందిరంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమర్జన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బీ గితే లతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఈ సంవత్సరం జరుగనున్నాయని, వీటికి తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ గణేష్ మండపాలలోని విగ్రహాలకు జి.పి.ఎస్,జియో ట్యాగింగ్ తో సహా మండపాల వివరాలు అందించాలని అన్నారు.గణేష్ నిమర్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని, గణేష్ విగ్రహం నిమర్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, నిమర్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ నిమర్జనం సందర్భంగా ప్రతి గణపతి విగ్రహం మండపం నుంచి నిమర్జన పాయింట్ కు తరలించే రూట్ మ్యాప్ ఫైనల్ చేయాలని అన్నారు. నిమర్జనం సందర్భంగా ఎక్కడా కూడా వైన్స్ అమ్మడానికి వీలు లేదని, బెల్ట్ షాపుల పట్ల కూడా ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

వినాయక నిమర్జనం సజావుగా జరిగేలా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో రాధాబాయి, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా ఫైర్ సర్వీసెస్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి, సెస్ అధికారులు మున్సిపల్ కమిషనర్ అన్వేష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

వేద న్యూస్



# బిఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం



**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**

మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్ లో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సిరిసిల్ల శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అధ్యక్షతన జరగనున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి సన్నాహకంగా గురువారం ఖాజాగూడ లోని గచ్చిబౌలి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గచ్చిబౌలి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సమావేశం కోసం చర్చించి సూచనలు సలహాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో అంజమ్మ, దారుగుపల్లి నరేష్, సతీష్ ముదిరాజ్, నాగపూరి అశోక్ యాదవ్, రమేష్ గౌడ్,పరమేష్, శామ్లెట్ శ్రీనివాస్,అలీం,నవాజ్, ఖాదర్ ఖాన్, మక్బూల్,తాహెర్, బురాన్,బాలమణి, మాధవి, సుగుణ, అజీమ్, లాయక్ ఖాన్, జాకీర్, బాలరాజ్ గౌడ్, అజయ్ గౌడ్, వినోద్ కుమార్, మణి తేజ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.400 కోట్ల విలువైన అక్రమనిర్మాణాలు నేలమట్టం

**వేదన్యూస్ డెస్క్:**

రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రోడ్లను ఆక్రమించి చేపట్టిన పలు నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా 2 ఆక్రమణకు (దాదాపు 8,500 గజాలు) గురయ్యాయి. అలాగే 5,000 గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఈ విధంగా మొత్తం 16000 గజాల స్థలాన్ని అక్రమణదారుల నుంచి హైడ్రా కాపాడింది. ఈ ఆస్తుల విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుంది.

# రైల్వే స్టేషన్లో గోడను ఢీకొన్న గూడ్స్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ రైల్వే స్టేషన్లో గురువారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. రైల్వే స్టేషన్ లోని ఓ గూడ్స్ రైలు రివర్స్ చేస్తూ అదుపుతప్పి ప్రమాదవశాత్తు రైల్వే స్టేషన్ ముందున్న ఏటీఎం పక్క గోడను ఢీకొంది. ఈ ఘటనలో గోడ ధ్వంసం అయ్యింది. ఏటీఎంలో ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది.

# దోమలు చిన్నవి..జబ్బులు పెద్దవి

**వేద న్యూస్, బోయినిపల్లి :**



గత కొద్ది రోజులు గా వర్షాలు కురుస్తున్న%శీ%దునా అందరు వ్యక్తిగత శుభ్రతపాటిస్తూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బోయినిపల్లి మండలం విశ్రాంత మండల అధికారి సి రామరాజు అన్నారు. ఇంటి పరిసరాల్లో నిలువ ఉన్న నీటి కుంటలు, లేకుండా వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని ఎక్కడ పడితే అక్కడ నిల్వచెత్తను,ఎప్పటికప్పుడు, తగులబెట్టి, మురుగునీరు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పిల్లల్ని అపరిశుభ్రము గల ప్రదేశాల్లో తిరగనీయకుండా ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగనీయకుండా,ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనారోగ్యమే మహా దౌర్భాగ్యం అని తెలుసుకోవాలని అన్నారు.

# కాళేశ్వరం నివేదికపై హై కోర్టులో వాడివేడిగా వాదనలు

**వేదన్యూస్ డెస్క్:**




మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై వేసిన పిటిషన్లపై తెలంగాణ హై కోర్టులో ఇవాళ( గురువారం) విచారణ జరిగింది. రెండు పిటిషన్లను కలిపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది. ఐదు అంశాలను ప్రేయర్‌గా పేర్కొన్నారు పిటిషనర్లు. కేసీఆర్ తరఫున వాదనలను సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం వినిపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక రద్దు చేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. కాళేశ్వరం కమిషన్‌ను నియమిస్తూ గత ఏడాది జీఓను కొట్టేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. తమకు కమిషన్ నివేదికను ఇవ్వలేదని కేసీఆర్, హరీష్‌రావు పేర్కొన్నారు. కమిషన్ విచారణ సమయంలో యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని పిటిషన్‌లో సుందరం తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పిటిషన్‌లో సుందరం వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ఎస్‌ని అప్రదిష్టపాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరుపు న్యాయవాది సుందరం తెలిపారు. రాజకీయ వ్యూహంతోనే జస్టిస్ గోష్ కమిషన్ నియామకం జరిగిందని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని వివరించారు.

దురదృష్టవశాత్తూ వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్ ఒక పిల్లర్ కుంగిందని.. వర్షాకాలంలో అకాల వర్షాలు కారణంగా కూలిందని తెలిపారు. కుంగిపోవడానికి డిజైనింగ్ కానీ ఇంజనీరింగ్‌తో ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరుపు న్యాయవాది సుందరం స్పష్టం చేశారు. నివేదిక కాపీలను తమకు అందజేయకుండా మీడియాకు అందజేయడంలో దురుద్దేశం ఉందని సుందరం చెప్పుకొచ్చారు. సాధారణ ప్రజల్లో తమ పరువును అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని సుందరం తెలిపారు.

**– నోటీసులు సరిగా ఇవ్వలేదు..కేసీఆర్ తరఫు న్యాయవాది సుందరం**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని న్యాయవాది సుందరం తెలిపారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదని వాదించారు. నివేదికను కూడా కేసీఆర్, హరీష్‌రావుకు అందించలేదని న్యాయవాది సుందరం వెల్లడించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని సుందరం తెలిపారు. రాజకీయంగా నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని అన్నారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. పిటిషనర్లు కేసీఆర్, హరీష్‌రావు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయట పెట్టారని ప్రభుత్వాన్నిహైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి జర్నలిస్టుకు 60 పేజీల నివేదిక అందజేశారని సుందరం తెలిపారు. న్యాయస్థానానికి సమర్పించిన కాపీలు సరిగ్గా కనిపించడం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. నివేదిక కాపీలు సరిగ్గా కనిపించేలా ఇస్తే తర్వాత విచారణ చేస్తామని తెలిపింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఈరోజే విచారణ కొనసాగించాలని కేసీఆర్ తరుపు న్యాయవాది సుందరం కోరారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అధికారికంగా విడుదల చేశారా అని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిని హైకోర్టు మూడు ప్రశ్నలు వేసింది. నివేదిక కాపీను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారా..? పిటిషనర్లకు 8బీ కింద నోటీసులు ఇచ్చారా లేదా..? కమిషన్ నివేదిక ప్రస్తుత పరిస్థితి ఏంటి..? అని హైకోర్టు ప్రశ్నించింది. తాము ఇచ్చిన నోటీస్ 8బీ నోటీస్ అని న్యాయస్థానానికి అడ్వకేట్ జనరల్ తెతెలిపారు. సెక్షన్ మెన్షన్ చేయనంత మాత్రానా అది 8 బీ నోటీస్ కాదంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించాల్సిందేనని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి పట్టుబట్టారు.

# శ్రీశైలంలో కుట్రలు జరుగుతున్నాయి

**– ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులపై దాడి చేసిన రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి**

**– ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**

**వేదన్యూస్ డెస్క్:**



శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వ్యవహారంపై గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులపై దాడి చేసిన రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారని.. ఈ విషయం చాలా మంచిదేనని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులపైన దాడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయనే మంచి సందేశాన్ని పవన్ కల్యాణ్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు.శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని కాపాడే బాధ్యత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైన కూడా ఉంటుందని రాజాసింగ్ సూచించారు. శ్రీశైలం జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడానికి యావత్ భారతదేశం నుంచి భక్తులు చాలామంది వస్తారని.. కానీ దురదృష్టం ఏంటంటే గతంలో రాజకీయ పార్టీల నేతలు కొన్ని పాపాలు అక్కడ చేశారని గుర్తుచేశారు. శ్రీశైలం చాలా పెద్ద పవిత్ర స్థలం, కానీ ఈ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేయడానికి కుట్రలు చాలాకాలంగా జరుగుతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ముస్లింలను, క్రైస్తవులను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని షాకింగ్ కామెంట్స్ చేశారు రాజాసింగ్. శ్రీశైలం పవిత్ర ప్రాంతంలోని దాదాపు అన్ని దుకాణాలను ముస్లింలు, క్రైస్తవులు ఆక్రమించారని రాజాసింగ్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఈ విషయం తెలుసా.. లేదా? వారికి తెలిస్తే, మీరు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మన పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేయడానికి అలాంటి వ్యక్తులు శ్రీశైలం పవిత్ర స్థలాన్ని పాములా ఎందుకు ఆక్రమించారు? వారిని అక్కడి నుంచి ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు పేరుతో తప్పు చేశాయని విమర్శించారు. ఈ సమస్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ పరిష్కరించాలని అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. దయచేసి ఇక్కడ కూడా అదే తప్పు చేయొద్దని సూచించారు. శ్రీశైలం పవిత్ర స్థలాన్ని ఆక్రమించిన వారందరినీ, ఇతర మతాల వారిని వెంటనే సున్నిపెంట ప్రాంతానికి బదిలీ చేయాలని ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

# రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారు

**– తెలంగాణలో యూరియా కొరతకు కేంద్రమే పూర్తి కారణం – కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ కుట్ర అని ఆరోపణ**

**వేదన్యూస్ డెస్క్:**

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు యూరియా సంక్షోభాన్ని సృష్టిస్తోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు యూరియా కేటాయింపుల విషయంలో కేంద్రం తీవ్ర వివక్ష చూపుతోందని తుమ్మల విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై గత కొన్ని నెలలుగా కేంద్రానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్య తీవ్రతను వివరించేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరితే, ప్రధానమంత్రి మోదీ అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా యూరియా ఉత్పత్తి నిలిచిపోయిందని, తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలపైనా తుమ్మల తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని అన్నారు. "బాధ్యతగల పదవిలో ఉన్న రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారు. ఇలాంటి మూర?పు మాటల వల్ల బీజేపీ ఎప్పటికీ బలపడదు" అని హితవు పలికారు. రైతులను అడ్డుపెట్టుకుని కొందరు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, చచ్చిన పార్టీకి



ప్రాణం పోయాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ నెలాఖరులోగా రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను వెంటనే విడుదల చేయాలని తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా సమస్యను కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని, ఇలాంటి వారి పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడొద్దన్నందుకే..

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలోని వనపర్తిజిల్లాలోని ఘన్‌పూర్ మండలం కోతులకుంట తండాకు చెందిన కేతావత్ హనుమంతు (37)కు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కుమారుడు రవీందర్ (19), చిన్న కుమారుడు సంతోష్ ఉన్నారు. అయితే కొంతకాలం క్రితం వీరు జీవనోపాధి కోసం గచ్చిబౌలిలోని ఎన్టీఆర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు. హనుమంతు మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇక పెద్ద కొడుకు రవీందర్ ఇంటర్ పూర్తి చేసి ఏ పనీ చేయకుండా బెట్టింగ్ ఆడుతూ డబ్బులు వృధాగా పోగొట్టుతున్నాడు. బెట్టింగుల కోసం తెలిసిన వారి వద్ద అప్పులు సైతం చేస్తున్నాడు. ఈ క్రమంలో చిన్న కుమారుడి చదువుకు డబ్బుల్లేక హనుమంతు సొంతూరులోని భూమి తాకట్టు పెట్టి రూ.6 లక్షలు తెచ్చాడు. అయితే ఆ డబ్బుపై కన్నేసిన రవీందర్ బ్యాంకులో వేస్తే భద్రంగా ఉంటుందని మాయమాటలు చెప్పి.. తన అకౌంట్‌లో రూ.2.5 లక్షలు జమ చేయిం చుకున్నాడు. ఈ డబ్బు మొత్తం బెట్టింగ్ యాప్‌లో పెట్టి పోగొట్టాడు. అకౌంట్‌లో ఉన్న డబ్బులు విత్ డ్రా చేద్దామని తండ్రి అడిగిన ప్రతీసారి ఏదోసాకు చెప్పి తప్పించుకోసాగాడు. మరోవైపు కొడుకు బెట్టింగ్‌ల యవ్వారంపై తండ్రి కొడుకుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు రవీం దర్. మంగళవారం మధ్యాహ్నం మరోమారు డబ్బుల గురించి తండ్రి హనుమంతు కొడుకును నిలదీశాడు. దీంతో తన ఫ్రెండ్ డబ్బులు ఇచ్చేందుకు వస్తున్నాడని చెప్పి.. ఎన్టీఆర్ నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తండ్రిని తీసుకెళ్లాడు. సర్‌ప్రైజ్ అని చెప్పి తండ్రి కళ్లకు గంతలు కట్టిన రవీందర్.. అప్పటికే అనతో తెచ్చుకున్న కత్తితో తండ్రి గొంతులో పొడిచాడు. దీంతో హనుమంతు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073